రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

పూర్తయింది ఒక్క శాతమే..!

- ముందుకు కదలని జగనన్న కాలనీలు - పెరిగిన ఖర్చులతో ఇళ్లు కట్టలేమంటున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జగనన్న కాలనీలు ముందుకు కదలడం లేదు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా కేవలం ఒక్క శాతం ఇళ్లు మాత్రమే నిర్మాణం పూర్తయ్యాయి. పెరిగిన ఖర్చులతో ఇళ్లు కట్టలేమని లబ్ధిదారులు తేల్చి చెబుతున్నారు. ఇళ్లు కట్టుకోకపోతే పట్టా వెనక్కి తీసుకుంటామని అధికారులు బెదిరింపులకు దిగుతున్నారు...

పేదలకు పక్కా గృహాలు నిర్మించాలని పేదలందరికీ ఇళ్లు పేరుతో ప్రభుత్వం జగనన్న కాలనీలకు శ్రీకారం చుట్టింది. తొలుత ఇళ్లను ప్రభుత్వమే నిర్మించి ఇస్తామని చెప్పినా తరువాత కేవలం స్థలాలను మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. ఇంటి నిర్మాణం కోసం పిఎంఎవై, రూరల్, అర్బన్ హౌసింగ్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.2.50 లక్షలు అందిస్తున్నారు. ఇసుక దగ్గర నుంచి సిమెంట్, ఇనుము ఖర్చులు భారీగా పెరగడంతో సొంత డబ్బులతో ఇంటిని కట్టుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల కింద 10,150 ఇళ్లను మంజూరు చేశారు. వీటిలో ఇప్పటి వరకూ 148 అంటే ఒక్క శాతం మాత్రమే నిర్మాణం పూర్తయ్యాయి. వాటిలో ఆదోని పట్టణంలో అర్బన్ హౌసింగ్ కింద 99 ఇళ్లు, ఎమ్మిగనూరులో 32 పూర్తయ్యాయి. రూరల్ హౌసింగ్ కింద పూర్తయిన వాటిలో హాళహర్వి మండలంలో 2, హొళగుంద మండలంలో 2, ఆదోనిలో 5, ఆలూరులో 3, నందవరంలో 2, ఎమ్మిగనూరులో 3 124 ఇళ్లు మాత్రమే బేసెమెంట్ లెవల్‌లో ఉన్నాయి. పూర్తయి ఇళ్లకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 16.33 లక్షలను ప్రభుత్వం లబ్ధిదారులకు బిల్లుల రూపంలో చెల్లించింది. ఇంటి నిర్మాణానికి అవసరమైన సామగ్రి ధరలు భారీగా పెరగడంతో జిల్లాలో నిర్మాణదారులు బెంబేలెత్తుతున్నారు. ఇసుక, సిమెంటు, స్టీల్ అన్నీ విపరీతంగా పెరగడంతో నిర్మాణ రంగం డీలా పడింది. దీంతో ఉపాధి లేక వ్యాపారులు, కూలీలు ఇబ్బంది పడుతున్నారు. సామాన్యుల నుంచి బిల్డర్ల వరకు, పెరిగిన ధరలతో గిట్టుబాటు కాదని దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నారు. జిల్లాలోని జగనన్న కాలనీల్లో గతంలో ప్రారంభించిన ఇళ్లలో పది శాతం కూడా పూర్తి చేయలేకపోయారు. కరోనా తరువాత సిమెంటు, స్టీల్ వంటి నిర్మాణ సామగ్రి విపరీతంగా పెరగడమే ఇందుకు కారణం. ఇక, పెయింట్ 50 శాతం, కూలీ 40 శాతం పెరిగింది. ప్లంబింగ్, వైరింగ్, స్విచ్‌బోర్డులు, విద్యుత్ వైర్లు, అల్యూమినియం కిటికీలు, తలుపులు, టైల్స్.. ఇలా అన్నీ గణనీయంగా పెరగడంతో ఇల్లు కట్టడానికి బెంబేలెత్తుతున్నారు. మరో వైపు ఇళ్లు కట్టుకోకపోతే ఇంటి స్థలం పట్టా వెనక్కి తీసుకుంటామని అధికారులు లబ్ధిదారులను బెదిరిస్తున్నారు. తమకు ఇచ్చిన పట్టాను మళ్లీ వెనక్కి తీసుకుంటామని చెప్పడం పట్ల లబ్ధిదారుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

పత్తికొండలో పునాదుల దశలోని జగనన్న కాలనీలోని ఇళ్లు

మౌలిక సదుపాయాలూ కరువే..

ఇంటి పట్టాలు ఇచ్చిన ప్రాంతాలు నివాసయోగ్యంగా లేకపోవడంతో లబ్ధిదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. కర్నూలు నగరంలో ఇప్పటికే పేదలకు పట్టాలిచ్చిన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించలేదు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13 వేల మందికి 2007లో ఇందిరమ్మ ఇళ్లు ఫేజ్-2 కింద జగన్నాథగట్టు వద్ద పట్టాలిచ్చారు. అప్పట్లో సిపిఎం ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ చొరవతో ఇందిరమ్మ ఇళ్లు ఫేజ్-3 కింద 2008లో పందిపాడు వద్ద 52 ఎకరాలను కొనుగోలు చేసి 2500 మంది లబ్ధిదారులకు ఇచ్చారు. ఆ రెండు ప్రాంతాల్లో ఇప్పటి వరకూ ప్రభుత్వం విద్యుత్, నీరు, రోడ్లు వంటి ఎటువంటి మౌలిక వసతులూ కల్పించలేదు. దీంతో 10 శాతం లబ్ధిదారులు కూడా ఆ ప్రాంతాల్లో గృహాలను నిర్మించుకోలేదు. దీనికి తోడు ఒరిజినల్ పట్టాలు హౌసింగ్ కార్పొరేషన్ దగ్గర ఉండిపోవడంతో వారికి ఆ స్థలాలపై పూర్తి హక్కులు కూడా లేకుండా పోయాయి. తరువాత వచ్చిన టిడిపి ప్రభుత్వం వాటిపైన దృష్టి సారించలేదు. ఇప్పుడున్న వైసిపి ప్రభుత్వం కూడా ఆ ప్రాంతాల వైపు చూడకపోవడంతో లబ్ధిదారులు రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం నగరానికి 15 కిలోమీటర్ల దూరంలోని రుద్రవరంలో పట్టాల్విడం పట్ల కూడా లబ్ధిదారుల నుంచి అసహనం వ్యక్తమవుతోంది.

కుల కార్చిచ్చును ఆర్పండి...

- కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనంద్‌బాబు
- రచ్చుమర్రి నుంచి మాధవరం పోలీసు స్టేషన్ వరకు నిరసన యాత్ర

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రచ్చుమర్రిలో అహంకారులు రగల్చిన కుల కార్చిచ్చును ఆర్పాలని నాయకులు డిమాండ్ చేశారు. సమానత్వం కోరిన దళితులపై దాడి చేసిన వారందరినీ అరెస్టు చేయాలంటూ కోరారు. గురువారం రచ్చుమర్రి గ్రామం నుంచి మాధవరం పోలీసు స్టేషన్ వరకు నిరసన యాత్ర చేపట్టారు. దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రచ్చుమర్రి గ్రామంలో దాడికి గురైన బాధితులను పరామర్శించి, బాధితులతో బాధలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రచ్చుమర్రి గ్రామ దళిత పేట నుంచి మాధవరం గ్రామం వరకు నిరసన పాద యాత్ర నిర్వహించారు. మాధవరం పోలీసు స్టేషన్ ముందే అరగంట పాటు రాస్తారోకో నిర్వహించి, సమస్యలతో కూడిన వినతిని సిఐ శ్రీనివాసులుకు అందజేశారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎమ్‌డి.ఆనంద్‌బాబు, ఎంఆర్‌పిఎస్ (మంద) నాయకులు నగేష్, జై భీమ్ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు చిక్కం జానయ్య, ఎంఆర్‌పిఎస్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ టిఎం.రమేష్, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు అంబ్రేష్, కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు రాముడు, దళిత మహిళా సంఘం జిల్లా కన్వీనర్ డి.విజయమ్మ, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.సురేష్, డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు కరుణాకర్, చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు ఆంథోని పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ హక్కులను అమలు చేయమంటే, దళితులపై దుర్మార్గంగా దాడి చేసి, దళితులు పెట్టుకున్న దుకాణాన్ని ధ్వంసం చేసి ఆస్తి నష్టం కలిగించారన్నారు. పోలీసులు సర్ది చెప్పి 144 సెక్షన్ పెట్టిన తర్వాత, దళిత కుటుంబాలను సామూహికంగా హత్య చేయాలని కత్తులు, కర్రలు, బడిసెలు ఇనుప రాడ్లతో దళితపేట పైకి దండెత్తిపోయారన్నారు. పోలీసుల సమక్షంలోనే దళితులపై దౌర్జన్యం చేశారన్నారు. ఇంత జరిగినా, దాడి చేసిన వారిని అరెస్టు చేయక పోగా, దళితులపై కూడా కౌంటర్ కేసులు నమోదు చేశారన్నారు.

రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకోవాలి

- పత్తికొండలో ప్రజాసంఘాల ప్రదర్శన

ప్రజాశక్తి-పత్తికొండ

దళితులు వేసుకున్న గుడిసెలను కూల్చివేసిన తహశీల్దార్ విష్ణు ప్రసాద్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గిత్తరి రమేష్, సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి ,దస్తగిరి డిమాండ్ చేశారు. గురువారం పత్తికొండ పట్టణంలోని ఈశ్వర్ రెడ్డి భవనం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు కెవిపిఎస్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు. రంగరాజులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గిత్తరి రమేష్, రంగారెడ్డి, దస్తగిరి ఇతర ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు. సామాజిక స్పృహ లేని అధికారులు నిజాయితీ లేనిపాలకుల కారణంగా నేటికీ జిల్లాలో కుల వివక్షత, అంటరానితనం, దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు దళితులపై జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి సర్వే నెం. 95లో 6.20లో రాజకీయ నాయకులు కబ్జా చేసిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసర్వే95లో ఎకరా భూమిలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరుపేద దళితడప్పు కళాకారులు, చర్మకారులు, కాటికాపర్లకు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. గుడిసెలను రెవెన్యూ అధికారులు రాత్రికి రాత్రి కూల్చేశారన్నారు. రాజకీయ నాయకులు వంకలు వాగులు, కొండలు గుట్టలలో అక్రమాలకు కబ్జా చేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుపోవడం లేదన్నారు. దళితులకు అన్యాయం చేసిన రెవెన్యూ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల డిమాండ్ చేశారు. అవసరమైతే దళితులందరినీ ఏకం చేసి జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని పత్తికొండ తహశీల్దార్‌కు అందజేశారు. కెవిపిఎస్ నాయకులు బాలచంద్ర, సురేంద్ర, మహేష్, పైగేరి రంగస్వామి, దూదెకొండ రమేష్, వెంకటేష్, పెద్దయ్య, దూదెకొండ రంగస్వామి, రాజశేఖర్, లక్ష్మి నారాయణ, వినయ్, అడవి రాముడు, పిఎన్ఎం జిల్లా సహాయ కార్యదర్శి కాశన్న, నియోజకవర్గ కార్యదర్శి వై.రమేష్ మండల కార్యదర్శి గోపాల్, ఉపాధ్యక్షుడు మధుబాబు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నరసన్న రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిద్దయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిజిహెచ్‌లో సిమెంట్ బెంచీలు ప్రారంభం

- జెవివి 50 సిమెంట్ బెంచీల విరాళం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన 50 సిమెంట్ బెంచీలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రారంభించారు. గురువారం ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణంలో జనవిజ్ఞాన వేదిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను జిల్లా కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 50 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ వైద్యశాలకు వైద్యం కోసం వచ్చే ప్రజలకు సేదతీరడానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఏర్పాటు చేయడానికి సహకరించిన ప్రజా సంఘాలను ఏర్పాటు చేయించిన జన విజ్ఞాన వేదిక వారికి కృతజ్ఞతలు తెలిపారు. జన విజ్ఞాన వేదిక సభ్యులు మాట్లాడుతూ ఈరోజు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణంలో రూ. లక్షాఅరవై వేల వ్యయంతో 50 సిమెంట్ బెంచీలను ఏర్పాటుచేశామన్నారు. వైద్యశాలకు వచ్చే ప్రజలకు సేద తీర్చుకోవడానికి ఉపయోగపడేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేవామన్నారు.జెవివి కన్వీనర్ రామకష్ణా రెడ్డి మాట్లాడుతూ మూడు రాష్ట్రాల నుండి లక్షలాది ప్రజలు ఆసుపత్రి సేవలు పొందుతున్నారని, ఆసుపత్రిలోనీ ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. త్వరలో ఆసుపత్రిలోని ఇతర సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.జెవివి కార్యదర్శి ప్రతాప రెడ్డి మాట్లాడుతూ ఒక సామాజిక బాధ్యత గా రోగులకు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశామని, ఇటువంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక సభ్యులు శ్రీనివాసరావు, మనోహర మాణిక్యం, డాక్టర్ నాగరాజు, పాణి,సుంకన్న, రత్నం ఏసేపు, ఎస్‌డిపిఐ నాయకులు జహంగీర్, చాంద్‌బాషా, అస్ఫాక్, జెసి.రాముడు, రామాంజనేయులు, యోహాను, రవికుమార్, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక నాయకులు, ఎస్‌యుసిఐ నాయకులు నాగన్న పాల్గొన్నారు.

జిజిహెచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన బెంచీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సృజన

ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం : హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. నగరంలోని 3వ వార్డు పూల బజార్, సేట్‌గల్లీ, సాగ్ మండి ప్రాంతంలో ఈ కార్యక్రమాన్ని ఆయన స్థానిక 3వ వార్డు కార్పొరేటర్ షాజహాన్ పర్వీన్ వార్డు ఇన్చార్జి ఖాదర్ బాష , స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. స్థానిక ప్రజలు వార్డు నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి తిరుగుతూ సంక్షేమ ఫలాల లబ్ధిని గురించి వివరించారు. వైసిపి వార్డు ముఖ్య నాయకులు, కన్వీనర్లు ఖుద్దుస్, చంద్ బాషా ,అంజు భాయ్, భీమ్‌అన్న,ముజహీద్, మున్నా, సచివాలయ, మున్సిపల్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న మహిళలు

బిజెపి ఎంపీని అరెస్ట్ చేయాలి

చెన్నమ్మ సర్కిల్‌లో ఐద్వా నిరసన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రెజ్లర్ల పై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. కల్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో చెన్నమ్మ సర్కిల్ సెంటర్‌లో సుజాత అధ్యక్షతన నిరసన తెలిపారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.అరుణ, ప్రధాన కార్యదర్శి ఎన్. అలివేలు మాట్లాడారు. దేశానికి అనేక పతకాలు తీసుకొచ్చిన రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌ను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తప్పు చేసిన వారిని శిక్షించకుండా వారిని కాపాడే ప్రయత్నం చేస్తుందన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమకు న్యాయం కావాలని రెజ్లర్లు శాంతియుతంగా నిరసన చేస్తుంటే వారిని బలవంతంగా ఖాళీ చేయించడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో మహిళలకు భద్రత కరువుతుందని వారు వాపోయారు. ఇప్పటికైనా తప్పుచేసిన బిజెపి ఎంపీని అరెస్టును చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.మధు మహిళా సంఘం జిల్లా నాయకులు మండల నాయకురాలు కోమలి, రమణమ్మ, పద్మ, రామేశ్వరమ్మ, రేవతి, మంజుల పాల్గొన్నారు.

విద్యుత్ సౌధ ఎదుట నేడు సిపిఎం నిరసన

వినియోగదారులు పాల్గొనాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారీగా మించిన విద్యుత్ ఛార్జీల పెంపతులకు వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం 10:30 గంటలకు బళ్ళారి చౌరస్తాలోని విద్యుత్ సౌధ భవన్ ముందు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి ఒక ప్రకటనంలో తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వినియోగదారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే నాలుగు సార్లు సర్దుబాటు పేరుతో కరెంట్ ఛార్జీలు పెంచిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మళ్ళీ యూనిట్ కి 40 పైసలు పెంచి పేద మధ్యతరగతి ప్రజలపై భారం వేస్తున్నారన్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటంలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. అందులో భాగంగా సిపిఎం చేపట్టే ఉద్యమంలో పాల్గొనాలని ఆయన ప్రజలను కోరారు.

ప్రజాధనం వృధా : పిపిఎస్ఎస్

ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారు?

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మేయర్, ఎమ్మెల్యేలు కార్పొరేటర్లు స్పందించి రోడ్డుపై వృధా అవుతున్న ప్రజాధనాన్ని కాపాడాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలో ప్రధాన రోడ్డుపై సిమెంటు దిమ్మెలపైన మొక్కలు నాటి అవి పెరగడం లేదంటూ మట్టి మారుస్తూ లక్షల ప్రజాధనం వధా చేస్తుంటే ఇదంతా గమనించిన ప్రజలు వారెవ్వా క్యా హై మజా సిమెంట్ దిమ్మలపై మొక్కలు నాటుతున్నారు అంటూ వ్యంగ్యంగా మాట్లాడకుంటున్నారని అన్నారు. ఒక అధికారి రోడ్డు మధ్యలో సిమెంటు కంకరతో దిమ్మెలు వేయిస్తున్నాడని, మరో అధికారి వాటిని తొలగించకుండానే దిమ్మెలకు ఇరువైపులా సిమెంటు స్టీలు కంకరతో గోడలు నిర్మించి మట్టి వేసి మొక్కలు వేస్తారని, ఆ మొక్కలు పెరగడం లేదని లక్షలు వెచ్చించి పాత మట్టిని తీసి కొత్త మట్టిని వేస్తున్నారని ఇదంతా ప్రజాధనం వృధా కాకుంటే ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటి వరకు సి క్యాంపు కూడలి నుండి నంద్యాల చెక్ పోస్ట్ వరకు దాదాపు రూ.50 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిసిందన్నారు. కింది స్థాయి ఇంజనీర్ల అశాస్త్రీయంగా అభివద్ధి పనులు చేస్తున్నందువల్ల ప్రజాధనం వృధా అవుతుంటే సూపరిండెంట్ ఇంజనీరు ఎందుకు స్పందించడం లేదని అన్నారు.

కాంట్రాక్టర్,లేదా క్రింది స్థాయి ఇంజనీర్ల కు ప్రభావితమవుతున్నాడా?పన్నులు కట్టిన ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. నగర మేయర్, ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్లు వెంటనే స్పందించి ప్రజాధనాన్ని కాపాడాలని కోరారు.

వాలంటీర్ల సేవలు అమోఘం

సేవా మిత్ర - సేవారత్న - సేవా వజ్ర పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: గ్రామవార్డు వలంటీర్ల సేవలు అమోఘం, అద్భుతం అంటూ కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్, నగర మేయర్ బివై. రామయ్య అభివర్ణించారు. గురువారం కర్నూలు 1వ వార్డ్ నాగమయ్యకట్టా వివేకానంద పాఠశాల మైదానంలో నిర్వహించిన 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమానికి కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్, మేయర్ బి.వై రామయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామ వాలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా లంచాలకు తావులేకుండా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు పథకాలు అందించాలనే ఉద్దేశంతోనే వాలంటీర్ వ్యవస్థను సీఎం జగన్ ఏర్పాటు చేశారన్నారు. దళారుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడానికి కారణం వలంటీర్లేనని, ఒకటో తేదీ వేకువజామున ఇంటి వద్దే పింఛన్లు అందుతున్నాయంటే వలంటీర్ల చిత్తశుద్ధే కారణమన్నారు. వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. గ్రామ స్వరాజ్యం సాధించడానికి ముఖ్యమంత్రి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. కర్నూలు నియోజకవర్గంలో 1వ వార్డు నుండి 6వ వార్డువరకు ఉన్న 1నుండి 17 సచివాలయల వాలంటీర్లకు సేవామిత్ర-సేవారత్న - సేవా వజ్ర పురస్కారాల ప్రదానోత్సవం చేశారు. కర్నూలు నియోజకవర్గంలో ఐదుగురు వాలంటీర్లకు సేవ వజ్రా అవార్డు లభించిందన్నారు. మెప్మా అధికారి ఆర్.వెంకటలక్ష్మి, మునిసిపల్ అధికారి సోహైల్, కో-ఆప్షన్ మెంబెర్ నయీమ్ పాషా, కార్పొరేటర్లు 1వ వార్డ్ షాషావలి, 3వ వార్డ్ షాజహాన్ పర్వీన్, 4వ వార్డ్ అర్షియా పర్వీన్ , 6వ వార్డ్ నీలోఫర్, 2వ వార్డ్ ఇంచార్జి జిల్లా వక్ఫ్ బోర్డు మెంబెర్ ఫైరోజ్, 3వ వార్డ్ ఇంచార్జి ఖాదర్ బాషా, వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ బివై.రామయ్య

ఉపాధి పనులను పరిశీలిస్తున్న సర్పంచి బాలపీర

సర్పంచి చొరవతో ఉపాధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూల్ మండలం, బి.తాండ్రపాడు గ్రామంలో స్థానిక సర్పంచి ఎస్.బాలపీర చొరవతో ఉపాధి హామీ పనులను గురువారం ప్రారంభించారు. ఆయన గత కొన్ని రోజులుగా గ్రామంలో ఉపాధి పనులు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి పనులను ప్రారంభించడానికి చొరవ చూపారు. ఈ మేరకు ఉపాధి అధికారి, పంచాయతీ సెక్రటరీతో ఉపాధి పనులను గుర్తించి ఎస్టిమేట్ వేయించి పనులను ప్రారంభించారు. ఉపాధి కూలీలు గ్రామంలో సంతోషం వ్యక్త పర్చారు. ఈ సందర్భంగా సర్పంచి బాపీర మాట్లాడుతూ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేక పోవడం వలన పనులు గుర్తించి చేయించే వారు లేక పోవడంతో పనులు ఆగిపోయాయి అన్నారు. గ్రామంలో ప్రభుత్వం ఉపాధి పనులు 100రోజులు కల్పిస్తుందని, ఈ పనులు చేయకపోతే నిధులు వేస్ట్ అవుతాయని చొరవ తీసుకుని గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభించామన్నారు. గ్రామంలో వ్యవసాయ కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ప్రభుత్వం పనుల దగ్గర నీడ వసతి కల్పించాలని, వారం వారం పే స్లిప్స్ ఇవ్వాలని, 200 రోజులు పనులు కల్పించి, రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. పాత పద్ధతులులలోనే పనులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ మధుబాబు, టెక్నికల్ అసిస్టెంట్, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

నునసరాళ్లలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం నునుస రాళ్ల లో గురువారంవిగ్రహ ప్రతిష్ట వేడుకలు ప్రారంభమయ్యాయి. శ్రీ గణపతి, శ్రీ నంది, ద్వజ, శిఖిర, నాబిశీల, నాగ దేవత, సహిత శ్రీ అన్నపూర్ణ, సమేత సోమలింగేశ్వర ప్రతిష్ట వేడుకలకు భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ ప్రతిష్ట కార్యక్రమాలకు కర్ణాటకకు చెందిన హంపి, విరుపాక్షి దేవాలయ సంస్థాన పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి హాజరయ్యారు. ఉదయం మహా గణపతి పూజ తో వివిధ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 10న జగద్గురు శంకర చార్య, శ్రీ హంపి పీఠాధిపతి మరిన్ని దేవత విగ్రహాలను ప్రతిష్టించనున్నారు. బయట నుండి వచ్చే భక్తులు అందరికీ ఉచిత అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతిష్ట వేడుకల సందర్భంగా వీర బ్రహ్మంగారి చరిత్ర నాటకం, పంచమాంకములు, రాతి దూలం పోటీలు తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అనుమతి

- ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు ప్రారంభం - ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ఆదోని పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని, ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా డిగ్రీ కళాశాల కోసం ఎదురుచూసిన విద్యార్థుల కల నెరవేరిందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు కోర్సులకు అనుమతి వచ్చిందని, విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ భవనం లేనందువల్ల నిర్మాణం జరిగే వరకు తాత్కాలికంగా ప్రభుత్వ గర్ల్స్ కళాశాలలోనే డిగ్రీ కళాశాల కొనసాగింపు జరుగుతుందన్నారు. ఉదయం, మధ్యాహ్నం షిఫ్ట్ పద్ధతిలో అమ్మాయిలు, అబ్బాయిలకు తరగతుల నిర్వహణ ఉంటుందని తెలిపారు. టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులను కేటాయింపులకు కూడా ప్రభుత్వ అనుమతి వచ్చిందన్నారు. ఇప్పటికే ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్‌ను ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. త్వరలోనే శాశ్వత భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. కళాశాల మంజూరు కోసం పోరాడిన విద్యార్థి సంఘాల నాయకులకు అభినందనలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

- కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనంద్ బాబు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి ఉపాధి ఇవ్వాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎమ్‌డి.ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. డప్పు కళాకారులు, చర్మకార వృత్తిదారులు, స్కావెంజర్స్, తుంబుర కళాకారులు లాంటి వృత్తిదారుల బతుకుకు భరోసా కల్పించాలని కోరారు. గురువారం కోసిగిలోని గ్రామ కమ్యూనిటీ భవనంపై కెవిపిఎస్ మండల కార్యదర్శి రామకోటి హనుమంతు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆనంద్ బాబు, కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ, దళిత మహిళా సంఘం జిల్లా కన్వీనర్ బి.విజయమ్మ, సిఐటియు, రైతు సంఘం మండల కార్యదర్శులు రాముడు, వీరేష్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనంతో పాటు, దళిత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామ గ్రామాన దళిత రక్షణ యాత్రను చేపట్టి, దళితుల సమస్యలపై మరో సామాజిక ఉద్యమానికి సన్నద్ధం చేస్తామని తెలిపారు. అందుకు దళితులంతా అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కెవిపిఎస్ అనుబంధ సంఘాల నాయకులు ముక్కురన్న, దిలీప్, ప్రకాష్, ఉసేని పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల మధ్య వివాదం..

- పోలీసు స్టేషన్‌కు చేరిన పంచాయితీ

ప్రజాశక్తి - ఆదోని

వివరాలు వెల్లడిస్తున్న మల్లిక

ఆదోని పట్టణంలో ట్రాన్స్‌జెండర్ల మధ్య వివాదం నెలకొంది. ఒకరిపై ఒకరు భౌతిక దాడులకు దిగడంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సంఘం ఆధిపత్యం కోసం వారి మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. గురువారం ఆదోని ట్రాన్స్‌జెండర్ అధ్యక్షులు మల్లిక మాట్లాడుతూ... పట్టణంలోని బండిమెట్ట ఉల్లిగమ్మ దేవరలో కైరుపల కృష్ణవేణి, కొండగేరి మాధురి అనే ట్రాన్స్‌జెండర్లు మద్యం సేవించి జుబేదా, లక్ష్మి, హారతిపై భౌతికంగా దాడి చేశారని వాపోయారు. తలవెంట్రుకలు తెగే విధంగా లాగి విచక్షణారహితంగా కొట్టారన్నారు. న్యాయం చేయాలని ఆదోని త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆదోనిలో రెచ్చిపోతున్న దొంగలు...

- శివారు ప్రాంతాల్లో కనరాని పోలీసు గస్తీ...

ప్రజాశక్తి - ఆదోని

తాళం పడిందంటే చాలు దొంగలు రెచ్చిపోయి ఇళ్లను లూటీ చేస్తున్నారు. ఆదోని పట్టణంలో రోజురోజుకూ దొంగతనాలు పెరుగుతూనే ఉన్నాయి. పట్టణంలో ఏదో ఒకచోట రోజూ దొంగతనం జరుగుతూనే ఉంది. పట్టణ శివారులో నివాసం ఉంటున్న ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్తే ఇంటిని దొంగలు గుల్ల చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

పట్టణ ఆవాసాలు పెరిగిపోవడంతో ప్రభుత్వాలు కూడా పట్టణంలో మూడు సర్కిల్ పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేసి భారీ స్థాయిలో సిబ్బందిని, సిఐలను, ఎస్ఐలను నియమించాయి. అలాగే రోజూ చుట్టుపక్కల ఉన్న ఆదోని తాలూకా, ఇస్వీ, పెద్దతుంబలం, ఆస్పరి, కౌతాళం తదితర ప్రాంతాల పోలీసు సిబ్బంది సైతం రాత్రి పూట గస్తీకి బందోబస్తు విధులు కేటాయిస్తున్నారు. రాత్రిపూట దొంగతనాలు జరగకుండా ముమ్మరంగా పోలీసు గస్తీ నిర్వహించాలని జిల్లాస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అంతకంటే ముఖ్యంగా ఆదోని డివిజన్ పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు గతంలో ఉన్న పోలీసు సబ్ డివిజన్‌లో ప్రస్తుతం కేవలం ఆదోని నియోజకవర్గానికి మాత్రమే ఒక డీఎస్పీ ఉండే విధంగా ప్రభుత్వం ఇటీవల చర్యలు తీసుకుని నియామకాలు కూడా చేపట్టింది. మొన్నటి వరకు ఆదోని పోలీసు సబ్ డివిజన్‌లో ఉన్న ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు ప్రత్యేకంగా ఎమ్మిగనూరులో పోలీసు సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేసి డీఎస్పీని కూడా నియమించారు. అలాగే కొత్తగా ఏర్పడిన పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో కూడా డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించి అక్కడ కూడా డీఎస్పీని నియమించారు. మొన్నటి వరకు ఆదోని పోలీసు డివిజన్‌లో ఉన్న ఆలూరు నియోజకవర్గాన్ని పత్తికొండ రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని పోలీసు సబ్ డివిజన్‌లోకి మార్చారు. ఆదోని నియోజకవర్గంలోని ఆదోని పట్టణం వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్లతోపాటు ఆదోని తాలూకా సర్కిల్ పోలీసు స్టేషన్, పోలీసు కంట్రోల్ రూమ్ పరిధిలో ఉన్నాయి. పోలీసు అధికారులు సిబ్బంది విధుల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి ఉంచేందుకు ఆదోని నియోజకవర్గానికి ప్రభుత్వం ఒక డీఎస్పీని నియమించింది. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ఆదోనిలో మాత్రం దొంగతనాలను అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. అలాగే పోలీసు శాఖకు సంబంధించిన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలోనూ పోలీసు అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటున్నారు. పోలీసు శాఖకు సవాలుగా ఉండే దొంగతనాలను అరికట్టడంలో పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టడం లేదని, గస్తీలు నిర్వహించడం లేదని ప్రజలు, దొంగతనాల బారిన పడిన బాధితులు వాపోతున్నారు. పోలీసులకు వాహనాలపై చలానాలు విధించడం, జరిమానాలు విధించడంపై ఉన్న శ్రద్ధ దొంగతనాలను అరికట్టడంలో ఉండడం లేదని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఈనెల 5న సోమవారం అర్ధరాత్రి మళ్లీ దొంగలు హల్‌చల్ సృష్టించారు. ఏకంగా పట్టణ శివారులోని శిరుగుప్ప టర్నింగ్‌లో ఉన్న నాలుగు దుకాణాలకు దొంగలు కన్నం వేసి నగదు, సామగ్రిని ఎత్తుకెళ్లారు. పట్టణంలోని శిరుగుప్ప చెక్‌పోస్టు సమీపంలో ఇమ్రాన్ ఐరన్ మార్ట్ దుకాణంలో అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు దుకాణానికి ఉన్న రేకుల షెడ్డును తొలగించి లోపలికి వెళ్లి, పెట్టెలో ఉంచిన రూ.3 లక్షలు ఎత్తుకెళ్లిపోయారని బాధితుడు ఇమ్రాన్ వాపోయారు. ఇమ్రాన్ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తి ఒకరు తన ముఖానికి కర్చీఫ్ కట్టుకొని నగదు దొంగతనం చేస్తున్న దృశ్యాలు సిసి కెమెరాలో నమోదైంది. అలాగే ఆ ప్రాంత సమీపంలో ఉన్న మహాలక్ష్మి ఆటో మొబైల్స్ దుకాణంలోనూ వెనుక వైపు నుంచి రేకుల షెడ్డును తొలగించి పెట్టెలోని రూ.3,500 ఎత్తుకెళ్లినట్లు బాధితుడు రవికుమార్ తెలిపారు. పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాల మెకానిక్ షెడ్డులో రూ.15 వేల విలువ చేసే పరికరాలు చోరీ చేశారని బాధితుడు హుస్సేన్ వలీ పేర్కొన్నారు. రాయనగర్ సమీపంలో ఉన్న పటేల్ ఐరన్ మార్ట్ దుకాణంలోనూ దొంగ చొరబడి పెట్టెలో ఉంచిన రూ.6 వేలు ఎత్తుకెళ్లారని దుకాణ నిర్వాహకుడు పేర్కొన్నారు. ఒకే రోజు నాలుగు దుకాణాల్లో చోరీకి పాల్పడడంతో స్థానికుల్లో భయాందోళన మొదలైంది. ఒకేరోజు ఒకే ప్రాంతానికి చెందిన నాలుగు దుకాణాల్లో చోరీ జరగడంతో పట్టణ శివారు ప్రాంతాల్లోనూ, పట్టణంలోనూ దుకాణ యజమానులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు మాత్రం షరామామూలే అన్నట్లుగా 1వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సిసి కెమెరాలను పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఘటన జరిగిన రాత్రి పూట ఈ ప్రాంతంలో పోలీసులు గస్తీ నిర్వహించారా లేదా అనే విషయంపై పోలీసు అధికారులు విచారించాలని పలువురు కోరుతున్నారు. రాత్రిపూట పోలీసు గస్తీని మరింత ముమ్మరం చేసి దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు.

జైలు శిక్ష పడిన వ్యక్తులు

అల్లర్లకు పాల్పడితే జైలు శిక్ష తప్పదు

- ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామాల్లో అల్లర్లకు, గొడవలకు, మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే వారికి జైలు శిక్ష తప్పదని ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. మండలంలోని వల్లూరు గ్రామానికి చెందిన వడ్డే చంద్రకళ, భర్త నీలకంఠను అదే గ్రామానికి చెందిన బడిగేరి చిన్న మారెప్ప, మారెన్న అలియాస్ బుక్క మారెన్నలు జనవరి 19, 2020న జుట్టు పట్టుకుని, చీర లాగి అవమాన పరిచి, చేతులతో, కాళ్లతో కొట్టి గాయపరిచారని తెలిపారు. చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ నారాయణ సరైన సమయంలో సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి భాస్కరరావు వాదించగా ఆదోని రెండో అడిషనల్ జెఎఫ్‌సిఎం జడ్జి విఎన్‌ఎన్.వెంకటలక్ష్మి సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత నేరం రుజువైనందున ఒక్కొక్కరికి సంవత్సరమున్నర జైలు శిక్ష, రూ.1000 చొప్పున జరిమానా విధించారు.

గంటపాటు భారీ వర్షం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- రెండు గంటల పాటు విద్యుత్ అంతరాయం
- నేల పాలైన మామిడికాయలు

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుందలో గంటపాటు భారీ వర్షం కురిసింది. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో రెండు గంటల పాటు మండలంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. తాగునీరు, చిన్న పరిశ్రమలపై ఆధారపడిన కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గాలివానకు మామిడికాయలు నేలపాలైనట్లు రైతులు వాపోయారు. ఈ వర్షం వల్ల పొలాల్లో విత్తనాలు వేసుకుంటామని కొంతమంది రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నెలరోజులుగా పొలాలను చదును చేసుకొని విత్తనాలు సిద్ధం చేసుకుని రోహిణి కార్తీలో విత్తనాలు వేయాలనుకున్న రైతులకు ఈ వర్షం మేలు చేసింది. మృగశిర కార్తీలో వర్షం కురవడంతో విత్తనాల వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ వర్షం మామిడి రైతులకు మాత్రం తీవ్ర నష్టాన్ని మిగిలిచ్చింది. జిల్లాలో 20 రోజులుగా అక్కడక్కడ భారీ వర్షాలు కురిసినా ఇక్కడ మాత్రం ఇదే మంచి వర్షమని రైతులు పేర్కొంటున్నారు. గంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పిడుగులు ఎక్కడ పడతాయోనని ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

గ్రామంలో నిలిచి ఉన్న వర్షపు నీరు

పరుగు పందెంలో బసప్ప నాయుడు విజేత

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని తిప్పలదొడ్డి గ్రామంలో ఎద్దుల పండగ సందర్భంగా నిర్వహించిన పరుగు పందెంలో సర్పంచి లక్ష్మి, మల్లయ్య కుమారుడు బసప్ప నాయుడు విజేతగా నిలిచారు. గురువారం బసప్ప నాయుడుకు స్టూడెంట్ యూత్ ఆధ్వర్యంలో 5 తులాల వెండి కడియాన్ని బహుమతిగా అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడం ద్వారా యువతలో దాగి ఉన్న నైపుణ్యం వెలుగులోకి వస్తుందని తెలిపారు. మొదటి బహుమతి పొందిన బసప్ప నాయుడును యువకులు పూలమాలలతో సన్మానించి అభినందించారు.

వంతెన నిర్మాణ పనులు చేపట్టాలి

- టిడిపి జిల్లా కార్యదర్శి ఈరన్న

తెగిపోయిన వంతెన

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని హత్తిబెళగల్, హర్దగేరి రహదారిలో చెరువు కట్ట వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని టిడిపి జిల్లా కార్యదర్శి ఈరన్న, మైనార్టీ నాయకులు షేక్షావలీ కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. రహదారిలో వంతెన వరద ధాటికి తెగిపోయిందని, రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రహదారిలో పెద్ద పెద్ద గుంతలు, కంకర తేలిన రాళ్ల వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాలు కురిస్తే హత్తిబెళగల్, హర్దగేరి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయని చెప్పారు. వంతెన లేకపోవడంతో రైతులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే వంతెన, రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

టిడిపి మేనిఫెస్టో వైసిపి పతనానికి నాంది

- టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి-ఆలూరు

టిడిపి మేనిఫెస్టో వైసిపి పతనానికి నాంది అని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ తెలిపారు. గురువారం ఆమె ఆలూరులో విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు విడుదల చేసి పనులు చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టో 5 కోట్ల మంది ప్రజలకు గ్యారంటీ ఇస్తూ ఆరు పథకాలను ప్రవేశపెట్టడం, మరిన్ని పథకాలతో అసలైన మేనిఫెస్టోను చంద్రబాబు త్వరలో ప్రకటిస్తారని తెలిపారు. ప్రజలు రాష్ట్ర భవిష్యత్తు కోసం మళ్లీ చంద్రబాబు నాయుడు పాలనను కోరుకుంటున్నారని అన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రతో వైసిపి నాయకుల్లో వణుకు పుడుతోందని తెలిపారు. పాదయాత్రకు రోజురోజుకు ఆదరణ లభిస్తోందని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. టిడిపి కార్యకర్తలు సమిష్టిగా పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. టిడిపి రాష్ట్ర నాయకులు నారాయణ, డాక్టర్ వెంకన్న, సర్పంచి మరకట్టు ఎల్లప్ప, జిల్లా నాయకులు నరసప్ప, భాస్కర్, కొమ్ము రామాంజి, నాగరాజు, సోమశేఖర్ నాయుడు, మండల కన్వీనర్ అశోక్ యాదవ్, ముద్దరంగ, గూళ్యం రామాంజినేయులు, కృష్ణ నాయుడు, రఘు రామిరెడ్డి, రమేష్, మహేష్, రాముడు, రంగయ్య, ఈరన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

నేడు ఆలూరులో విస్తృత స్థాయి సమావేశం

పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం టిడిపి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు సుజాతమ్మ తెలిపారు. నియోజకవర్గంలో వివిధ హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు, క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జీలు, సర్పంచులు, ఎంపిటిసిలు, టిడిపి కార్యకర్తలు, అభిమానులు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహిళపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు హనుమంతరావు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో కోర్టు రోడ్డులో నివసిస్తున్న మిమిక్రీ సత్యనారాయణ శర్మ భార్య సుజాతపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు సముద్రాల హనుమంతరావు, తాలూకా నాయకులు గురు రాఘవేంద్ర, మూర్తి స్వామి, హనుమంతరావు, ప్రసాద్, మాజీ కౌన్సిల్ కోనేరు నాగేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వాస్పత్రిలో బాధితురాలు సుజాతను పరామర్శించి, శర్మకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ సంఘం నాయకులు పట్టణ సిఐకి ఫిర్యాదు చేయగా కొండాపూర్ వహీద్, ఆయన భార్య తెహరాపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ప్రమాదకరంగా కల్వర్టు

- కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యులు నీలకంఠప్ప

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని శంకర్ నగర్, పంజరపోలు దగ్గర కల్వర్టు ప్రమాదకరంగా ఉందని కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యులు నీలకంఠప్ప, పట్టణ కార్యనిర్వాహణ అధ్యక్షులు దిలీప్ ఢోకా ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కల్వర్ట్‌ను నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లేబర్ కాలనీకి వెళ్లే దారికిరువైపులా భద్రత గోడలు నిర్మించక పోవడంతో అటువైపుగా హై స్కూలుకు వెళ్లే విద్యార్థులు రోడ్డు క్రాస్ చేసి వెళ్లాలంటే భయపడుతున్నారని తెలిపారు. రాత్రిలో రోడ్డు సరిగ్గా కనబడకుండా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రమాదాలు జరగక ముందే కల్వర్టుకు, రోడ్డుకు ప్రహరీ నిర్మించాలని రోడ్డు భవనాల అధికారులను కోరారు. లేకపోతే రోడ్డు భవనాల కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి మారుతి రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయినాథ్, యువజన నాయకులు దేవిశెట్టి వీరేష్, మద్దిలేటి, మాణిక్యరాజు, సుబ్బారెడ్డి, రాము పాల్గొన్నారు.

డ్రెయినేజీ, తాగునీటి పైపులను శుభ్రం చేయాలి

- సచివాలయ అధికారులకు డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కుంకనూరు గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవడంతో మురుగునీరు రోడ్ల మీదే ప్రవహిస్తోందని, తాగునీటి పైపులను శుభ్రం చేసి మరమ్మతులు చేయాలని డివైఎఫ్ఐ నాయకులు కె.శ్రీనివాసులు, చిన్న, వీరేంద్ర డిమాండ్ చేశారు. గురువారం గ్రామ సచివాలయ అధికారులకు వినతిపత్రం అందించారు.

వినతి పత్రం అందిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షాకాల సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో చిన్నపాటి వర్షాలకు మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని తెలిపారు. మురుగునీటి కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను సరిచేయాలని కోరారు. ఉరుకుంద, సింహాద్రి, హరికృష్ణ, రసూల్, మురళీ, సుధాకర్ పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు అశ్రునివాళి

ఒడిశా బాలసోర్ రైలు ప్రమాద మృతులకు మండలంలోని కుంకునూరు గ్రామంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. డివైఎఫ్ఐ నాయకులు చిన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులు శ్రీనివాసులు, చిన్న, వీరేంద్ర మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వంలో రైల్వే ప్రయాణికులకు భద్రత కరువైందని తెలిపారు. రైల్వే ప్రయివేటీకరణపై మోజు వల్లే కేంద్ర ప్రభుత్వం రైల్వేలో ఖాళీగా ఉన్న 3.15 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయలేదని చెప్పారు. ఉద్యోగులపై పని భారం పెరగడం, సిగ్నలింగ్ వ్యవస్థపై, రైల్వే ట్రాక్‌ల నిర్వహణపై రైల్వే పూర్తి నిర్లక్ష్యం వహించడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరిగి వందలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రైల్వే ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాలసోర్ లాకింగ్ వ్యవస్థ సరిగా లేదని, మార్చాలని లైన్‌మేన్ చెప్పినప్పటికీ రైల్వే శాఖ పట్టించుకోలేదని తెలిపారు. లోకో పైలట్లు 12 గంటలకు మించి పని చేయరాదని రైల్వే నిబంధన ఉన్నప్పటికీ దుర్మార్గంగా 70 శాతం మంది లోకో పైలట్లను 12 గంటలకు మించి పని చేయిస్తున్నారని చెప్పారు. రైల్వే ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని, వారి కుటుంబాల సభ్యులకు రైల్వేలో ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు. రైల్వే ప్రమాదాలకు కారణమయ్యే రైల్వే ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలని, రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ, ఇతర ప్రజాసంఘాల నాయకులు గురు రాజు, హరికృష్ణ రసూల్, మురళీ, ఉరుకుంద రాఘవేంద్ర, సింహాద్రి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార లావాదేవీలు నిర్వహించే విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ జి.హేమలత హెచ్చరించారు. గురువారం గోనెగండ్లలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయించే ఇన్‌పుట్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డీలర్లందరూ విత్తన చట్టం ప్రకారం క్రయవిక్రయాలు జరపాలని తెలిపారు. గోడౌన్ల లైసెన్స్‌లను ఇంక్లూజన్ చేసుకోవాలని, వచ్చిన ప్రతి విత్తన లాటుకు ఇన్వాయిస్ నెంబర్ ఉండాలని సూచించారు. ఎంఆర్‌పి ధరల కంటే అధిక ధరలకు విత్తనాలను విక్రయించరాదని తెలిపారు. రోజూ ధరల పట్టిక స్టాక్ బోర్డును నమోదు చేయాలని చెప్పారు. కొన్న ప్రతి రైతుకూ తప్పనిసరిగా బిల్లు ఇవ్వడంతో పాటు బిల్లుపై రైతు సంతకం చేయించుకోవాలని తెలిపారు.

మాట్లాడుతున్న ఎఒ హేమలత

12న నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

- టిడిపి మండల అధ్యక్షులు మల్లికార్జున

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఈనెల 12న పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు మల్లికార్జున తెలిపారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున, టిడిపి మండల ఉపాధ్యక్షులు బనవాసి అయ్యాలప్ప మాట్లాడారు. టిడిపి మండల కమిటీ సభ్యులు దేవిబెట్ట సోమేశ్వర్ రెడ్డి, బోడబండ సురేష్, చెన్నాపురం నాగరాజు, కేశన్న, రాఘవేంద్ర, నర్సింగరావు, శంకర్ గౌడ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మల్లికార్జున

నందవరం : ఈనెల 12న జరిగే టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు, మాజీ జడ్‌పిటిసి ముగతి ఈరన్న గౌడ్, ఎమ్మిగనూరు రైస్ మిల్స్ సంఘం అధ్యక్షులు నారాయణ రెడ్డి కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. టిడిపి ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు దావీదు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బాలరాజు, టిడిపి యువ నాయకులు భార్గవ్, కొండయ్య, తులసీరాం, తాయన్న, ఈరన్న పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న వెంకప్ప

భూమి పూజ చేశారు.. నిర్మాణం మరిచారు

- జనసేన ఆలూరు ఇన్‌ఛార్జ్ తెర్నేకల్ వెంకప్ప

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ మూడేళ్ల క్రితం కొత్తపేట రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారని, నిర్మాణం మరిచారని జనసేన ఆలూరు ఇన్‌ఛార్జ్ తెర్నేకల్ వెంకప్ప విమర్శించారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామంలో ఉన్న సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రధాన రహదారి, వీధుల్లో సిసి రోడ్లు, ఇంతవరకు వేయలేదని తెలిపారు. గ్రామంలో వికలాంగుడైన యువకుడు కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌ను సమస్యల పై ప్రశ్నిస్తే వాలంటీరు ఉద్యోగం నుంచి తొలగించడం అన్యాయమని చెప్పారు. కక్ష సాధింపులు మంచివి కాదని, వీలైతే సహాయం చేయాలని, ఒకరికి నష్టం కలిగించే పనులు చేయకూడదని తెలిపారు. జనసేన మండల నాయకులు మక్బుల్, నందు, వీరేష్, బడేసాబ్, లక్ష్మన్న, కృపాకర్, శివ, అహ్మాన్, రంగస్వామి పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

రాయితీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎఒ వరప్రసాద్ రైతులను కోరారు. గురువారం మండలంలోని చిన్నతుంబలం ఆర్‌బికెలో ఎఒ వరప్రసాద్ ఆధ్వర్యంలో రాయితీ వేరు శనగ, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొర్రెల సంఘం జిల్లా డైరెక్టర్ కె.ఎల్లప్ప మాట్లాడారు. రైతు భరోసా కేంద్రం ద్వారా గ్రామాల్లోనే విత్తన పంపిణీ చేపట్టడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. దళారీ వ్యవస్థ పూర్తిగా రూపుమాపడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. చిన్నతుంబలం హైస్కూల్ ఛైర్మన్ బుడ్డన్న, రైతులు కె.రాముడు, మల్లయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు రవితేజ, రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, ADONI
EP. 101/2017
IN
OS. 81/2017

Between: -
K.Lakshmi. ...Decree Holder
Vs
K Eranna. ...Judgment Debtor

Notice to Judgment Debtor-
K Eranna Sio K Pedda Hanumanthamma, Hindu, aged about 35 years, Railway Employee, resident of Kosigi village and Mandal.

Whereas the above named Decree Holder filed an EP. for recovery of EP. amount of Rs. 29, 274/- by way of salary attachment of the Judgment Debtor and the same is posted for your appearance if any on 30-06-2023. You are hereby directed to appear in person or through your Advocate on 30-06-2023 at 10.30 am. before the above said Court to answer the said claim. Failing which the matter will be decided in your absence and made set ex-parte.

G.C.RANGANNA,
G.RAJESH,
Advocates for Decree Holder.

అరటి రైతు అతలాకుతలం

- భారీ గాలివాన బీభత్సం - 900 ఎకరాల్లో దెబ్బతిన్న పంట..
- నేలకొరిగిన 8 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 25 స్తంభాలు - కూలిన మట్టి మిద్దె..

వేర్లతో సహా లేచి పడిపోయిన అరటి చెట్లు

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలంలో బుధవారం రాత్రి వీచిన భారీ గాలులకు, అకాల వర్షానికి అరటి తోటలు నేలకొరిగాయి. పంటంతా నేలరాలడంతో అరటి రైతు ఆవేదన వర్ణణాతీతం. మహానంది మండలంలో తిమ్మాపురం, బుక్కాపురం, అల్లినగరం, గోపవరం, కృష్ణనంది గ్రామాలలో అరటిపంట నేలవాలి రైతులకు కష్టాలను మిగిల్చింది. చేతికి వచ్చిన పంట కళ్ల ముందు నేల వాలిపోవడంతో రైతులు కన్నీటి పర్యంత మవుతున్నారు. భారీ గాలివాన బీభత్సవం వలన మండలంలో దాదాపు 900 ఎకరాల్లో పంట నష్టం కలిగింది. కోట్ల రూపాయల్లో నష్టం వాటిల్లింది. అరటి పంటకు ఒక ఎకరానికి సుమారుగా ఒకటిన్నర లక్ష నుండి రెండు లక్షల రూపాయల మేర పెట్టుబడి పెట్టారు. పంట చేతికి వచ్చే ముందు ప్రకృతి కన్నెరజేయడంతో గాలివానకు కళ్లముందే నేలకొరగడం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. ఈ సందర్భంగా నష్టపోయిన అయ్యన్న అరుగు గ్రామం రైతు రాజు, తిమ్మాపురం గ్రామ రైతు పగడాల నాగరాజు, బుక్కాపురం రమణయ్యలు మాట్లాడుతూ ప్రభు త్వం నుండి అరటి పంటకు ఇన్సూరెన్స్ సదు పాయం ఉంటే ఇంత ఆర్థిక నష్టం జరిగేది కాద న్నారు. చేతికి వచ్చిన పంట ఈ సంవత్సరంలో కళ్ళ ముందే మూడు పర్యాయాలు అకాల గాలివానకు దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యాన శాఖ వారు పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి రైతులకు పంట నష్టాన్ని ప్రభుత్వం నుండి ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు.

విద్యుత్ శాఖకు భారీ నష్టం : ఎఇ

ఈదురుగాలులతో కూడిన వర్షానికి విద్యుత్ శాఖకు సుమారు పది లక్షల రూపాయల మేరకు నష్టం వాటిల్లినట్లు విద్యుత్ శాఖ మండల ఏఈ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. పలుచోట్ల 25 విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయని, 8 ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాని తెలిపారు. ప్రాథమిక సమాచారం మేరకు గ్రామాల్లో, పొలాల్లో తమ సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారని చెప్పారు. పూర్తి స్థాయి సమాచారం అందిన తర్వాత, నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ఇతర సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగేలా చేశామన్నారు.

కూలిన మట్టి మిద్దె.. తప్పిన ప్రమాదం..

మహానంది మండలం గాజులపల్లె గ్రామ పరిధిలోని మజరా గ్రామం బసాపురంలో గత రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి జ్యోతుల చిన్న రామస్వామి చెందిన మట్టి మిద్దె కూలిపోయింది. ఆ సమయంలో ఆ ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని బాధితుడు వాపోయాడు. ఇతను పశువులు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. మట్టి మిద్దె కూలడంతో తనకు నిలువ నీడ లేకుండా పోయిందని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. అలాగే మండలంలోని మహానంది గ్రామంలో బుధవారం సాయంత్రం పిడుగు పడింది. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగక పోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే మహానంది గ్రామం పార్వతీపురం కాలనీలో పిడుగు పడిన ప్రదేశానికి సమీపంలో చిన్న రేకుల దుకాణం కూలిపోయింది.

కూలిన మట్టి మిద్దె

ఖరీఫ్ సాగు సాగేనా..?

- పదునైన వర్షం కోసం రైతన్న ఎదురు చూపు..
- గతేడాది ముందస్తు సాగు... - ఈ ఏడాదైనా నకిలీ విత్తనాల బెడద తప్పేనా..?

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఖరీఫ్ సాగు ఇప్పట్లో ముందుకు సాగేలా కనపడడం లేదు.. చినుకు కోసం రైతన్న ఎదురు చూస్తున్నాడు. నైరుతి ఋతుపవనాలు గత ఏడాది జూన్ 4, 5 తారీఖుల్లో ఎపిని తాకడంతో ముందస్తు సాగు చేపట్టారు. ఈ సమయానికి జిల్లాలో దాదాపు పత్తి, మినుము 3 వేల హెక్టార్లలో సాగు జరిగింది. అయితే ఈ ఏడాది జూన్ 1న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకినా ఏపిలో రుతుపవనాలు జాడ లేదు. గతేడాది ఖరీఫ్ సాగు జిల్లాలో 2.28 లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణం కాగా 2.52 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగు అయ్యాయి. ఈ ఏడాది ఖరీఫ్ సాగు సంబంధించి 2.37 లక్షల హెక్లార్లు సాధారణ విస్తీర్ణంగా వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు ప్రస్తుతం కేవలం 1200 హెక్టార్లలో సాగు అయినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడిస్తున్నారు.

విత్తనాలు కొరత : జిల్లాలో విత్తనాలు, ఎరువుల కొరత లేదని అధికారులు చెపుతున్నప్పటికి, అవసరం కంటే కేటాయింపులు తక్కువగా ఉన్నాయి. కంది 534.5 క్వింటాళ్లు అవసరం కాగా 500 క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు. మినుము 511.2 క్వింటాళ్లకు గాను 100, పెసర 35.6 క్వింటాళ్లకు గాను 20, వేరుశనగ 7510 క్వింటాళ్లకు గాను 3560, కొర్ర 16 క్వింటాళ్లకు గాను 15.5, జీలుగ, పచ్చిరొట్టె విత్తనాలు 5403 క్వింటాళ్లకు గాను 4,675, పిల్ల పెసర 491.3 క్వింటాళ్లకు గాను 225 క్వింటాళ్ల విత్తనాలు ఆర్‌బికెల్లోఉన్నాయి. మొత్తం 14,604.5 క్వింటాళ్ల విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. అధికారులు ఖరీఫ్ సాగుకు అన్ని రకాల విత్తనాలను ఇప్పటికే జిల్లాలోని 411 రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచినట్లు చెబుతున్నారు.

ఈ ఏడాదైనా నకిలీ విత్తనాల బెడద తప్పేనా..?

గత ఏడాది నకిలీ విత్తనాలతో పత్తి, మిరప, మొక్కజొన్న, వేరు శనగ వంటి పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం కనీసం నష్టపరిహారం చెల్లించకపోగా, నకిలీ విత్తనాల కంపెనీలపై చర్యలు తీసుకోలేదు. ఈ సారైనా ముందస్తుగా నకిలీ విత్తనాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతారా.. లేక తూతూ మంత్రంగా తనఖీలు చేసి చేతులు దులుపుకుంటారా అనేది వేచి చూడాల్సిందే. అధికారులు నకిలీ విత్తనాలపై కఠినంగా లేకపోతే ఈ ఖరీఫ్‌లో కుడా అన్నదాతకు నకిలీ బెడద తప్పదు.

పాఠశాలలను సిద్ధం చేయండి : డిఇఓ

మాట్లాడుతున్న డిఇఓ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వచ్చే వారంలో పాఠశాలలు ప్రారంభిస్తున్న దృష్ట్యా పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని జిల్లా విద్యాధికారి ఎం.అనురాధ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను శు భ్రపరచాలని, చిన్న చిన్న రిపేర్లను పాఠశాలల నిర్వహణ నిధుల ద్వారా మరమ్మతులు చేపట్టాలన్నారు. ఆర్ఓ ప్లాంట్ నీటి వసతిని, టాయిలెట్లలో శుభ్రత, నీటి వసతిని పెంపొందించాలన్నారు. పేరెంట్స్ కమిటీ తల్లిదండ్రులను కలిసి పాఠశాల అభివృద్ధికి కావాల్సిన అంశాలపై చర్చించాలని, ప్రారంభం రోజు తల్లిదండ్రులను ఆహ్వానించాలని ఎంఇఓలకు, హెచ్‌ఎంలకు సూచించారు. గుడ్డు, చిక్కి, రాగిపిండి మొదలైనవి ముందుగానే సేకరించుకోవాలని, విద్యార్థులకు ఆటపాటల ద్వారా విద్య నేర్పడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ

శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలిసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. గురువారం నాడు మద్దిలేటి స్వామి ఆలయ ఇఒ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రూ.3.90 కోట్లతో నిర్మించిన స్వామివారి ఆలయానికి సంబంధించిన శిలాఫలకాన్ని, శ్రీ చక్ర కాలంలో స్వామివారి ప్రత్యేక అలంకరణ మక్కుటంగా నిలవనున్న మహా ప్రాకారం, మహా మండపం నిర్మాణానికై రూ.12.70 కోట్ల నిధుల పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు.

లక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ముందుగా ఆలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని వేద పండితులు రాజేష్ గురుతోపాటు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ప్రధాన అర్చకులు మద్దిలేటి స్వామి పండితుల మంత్రోచ్ఛవాలతో కార్యక్రమం సాగింది. అనంతరం మంత్రికి, జడ్పి చైర్మన్‌లకు స్వామివారి జ్ఞాపకాలను తీర్థ ప్రసాదాలను పండితులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకట్ రెడ్డి,జడ్పిటిసి మెంబర్ శివలక్ష్మి, బేతంచెర్ల మండలం తహశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీవో వెంకన్న ,మాజీ ఆలయ చైర్మన్ లక్ష్మిరెడ్డి, బాబుల్ రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, చిత్రంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, ఆంధ్ర

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పిజి కళాశాల ఆడిటోరియంలో ఆంధ్ర చెస్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా సంఘం నిర్వహణలో గురువారం అండర్-19 ఫిడే ర్యాంకింగ్ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. చెస్ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, ఆంధ్ర చెస్ సంఘం అధ్యక్షులు కెవివి.శర్మ పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చదరంగం మెదడుకు పదును పెడుతుందని తెలిపారు. ఈ క్రీడ వలన బాలలలో మానసిక వికాసం కలుగుతుందని చెప్పారు. చెస్ క్రీడను విద్యార్థులకు పాఠ్యాంశంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నంద్యాలలో చెస్ పోటీలు తరచూ నిర్వహించడం అభినందనీయమని, చెస్ జిల్లా సంఘం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి ర్యాంకింగ్ రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్ తమ కళాశాలలో నిర్వహించడం సంతోషకరమన్నారు. కెవివి.శర్మ మాట్లాడుతూ జువనైల్ జైల్లో ఉన్న బాలలకు, అనాధ బాలల వసతి గృహాలలో రాష్ట్రవ్యాప్తంగా చదరంగం క్రీడలో ఉచిత శిక్షణ కార్యక్రమాలు చేపట్టబోతున్నామని తెలిపారు. ఈ టోర్నమెంట్లో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్రం తరఫున జాతీయస్థాయి చెస్ పోటీలలో పాల్గొంటారని ప్రకటించారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ఈ పోటీలలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొంటున్నారని, నాలుగు రోజులపాటు జరుగుతాయని తెలిపారు. అనంరం కెవివి.శర్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా క్రీడా ప్రాదేశిక అధికారి నరసింహారాజు, ఆంధ్ర రాష్ట్ర చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు చంద్రమోహన్, కార్యదర్శి కూరా ప్రసాద్, కోశాధికారి రత్నకుమార్, లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎలక్ట్ సుధాకర్ రెడ్డి, వైసిపి నాయకులు సోమశేఖర రెడ్డి, కర్నూల్ చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గోవింద జీయర్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధికారి శేషి రెడ్డి, నిర్వాహకులు ఇమామ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

భూమి పూజలో పాల్గొన్న ఏవి సుబ్బారెడ్డి, భూమా కిషోర్ రెడ్డి

స్ఫూర్తి మదర్ హోం అనాధాశ్రమం శాశ్వత భవన నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలో గత 12 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్న స్ఫూర్తి మదర్ హెూమ్ అనాధాశ్రమం శాశ్వత భవన నిర్మాణానికి ఎంవి నగర్ సమీపంలోని జాతీయ రహదారి సమీపంలో గురువారం ఫౌండర్ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి తాలూకా ఇంచార్జ్ భూమా కిషోర్ రెడ్డి భూమి పూజ చేశారు. అలాగే రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే నాగేశ్వర్ రెడ్డి పట్టణంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన స్ఫూర్తి మదర్ హెూమ్ ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. ఎంతోమంది అనాధ పిల్లలకు ఆశ్రయం ఇచ్చిన నాగేశ్వర్ రెడ్డి మంచి మనసుకు అభినందిస్తున్నామన్నారు. భవనం నిర్మాణానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బివి రామిరెడ్డి, న్యాయవాది సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అహోబిలేశుని సన్నిధిలో ఇరిగెల సోదరులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహెూబిల లక్ష్మీ నరసింహ స్వామిని ఇరిగెల సోదరులు గురువారం దర్శించుకున్నారు. వైసిపి సీనియర్ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి, ఎస్.లింగందిన్నె సర్పంచ్ ఇరిగెల విశ్వనాథరెడ్డి, ఇరిగెల ప్రతాప్ రెడ్డి తదితరులు దిగువ అహెూబిలంలోని ఆలయంలో లక్ష్మీ నరసింహ స్వామిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట ఇరిగెల సుధాకర్ రెడ్డి, ఇరిగెల దస్తగిరి రెడ్డి, రాంపల్లి రామకృష్ణ, మౌలాలి ,పెద్ద బాలయ్య, మిద్దె రాంపుల్లయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

దర్శనానికి ఆలయంలోకి వస్తున్న ఇరిగెల సోదరులు

ఇన్‌ఛార్జి డిఎస్ఒగా జగన్ మోహన్ రావు

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి డిఎస్ఒ జగన్ మోహన్ రావు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా ఇంచార్జ్ జిల్లా పౌరసరఫరాల అధికారిగా జగన్ మోహన్ రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల డిఎస్ఒగా ఉన్న ఆచార్యులు కర్నూలు జిల్లాకు బదిలీ పై వెళ్లారు. అనంతపురం జిల్లా ఏఎస్ఒగా విధులు నిర్వహిస్తున్న జగన్ మోహన్ రావును నంద్యాల జిల్లాకు ఇంచార్జ్ డిఎస్ఒగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయనను కలిసిన ప్రజాశక్తితో మాట్లాడారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠంగా అమలు చేస్తామన్నారు. ప్రజా పంపిణీలో ఎలాంటి అక్రమాలు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. జిల్లాలో 5,33,496 లక్షలు రేషన్ కార్డులున్నాయని, 1,200 ఎపిక్ షాపులు, 351 ఎండిలున్నాయన్నారు. లబ్ధిదారులకు ఇళ్ల వద్దకే వెళ్లి బియ్యంతో పాటు 3కేజీలు జొన్నలు అందిస్తామన్నారు. గ్యాస్ బాయ్‌లు డోర్ డెలివరీ సందర్భంగా సిలిండర్‌పై నిర్ణీత ధర కంటే అదనంగా వసూలు చేయకూడదన్నారు. అలాగే ఇంటి వినియోగ సిలిండర్‌లు కమర్షియల్‌గా వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ సంతోషంగా ఉంది : ఎమ్మెల్యే

ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన అనంతరం లబ్ధిదారులతో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల పట్టాలు అందజేయడం సంతోషంగా వుందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఇళ్ళ స్థలాల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మంత్రిగా ఉన్న శిల్పా మోహన్ రెడ్డి హయాంలో నంద్యాలలోని భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలను కేటాయించారని, ఆదర్శ కాలనీగా ఏర్పాటు చేయాలనే సద్దుదేశంతో ఇళ్ల స్థలాలను కేటాయించామని తెలిపారు.

అయితే వారికి ఇళ్లస్థలాల పట్టాలను అంద జేసేందుకు పలు అడ్డంకులు రావడంతో ఆలస్యమైందన్నారు. నేడు అన్నీ అడ్డంకులు తొలగడంతో 30 మంది భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌ను అరెస్టు చేయాలి

- ఆలిండియా బంజారా సేవా సంఘం డిమాండ్

మాట్లాడుతున్న వెంకటరమణ నాయక్

ప్రజాశక్తి నంద్యాల రూరల్

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రామ సుబ్బయ్యను వెంటనే అరెస్ట్ చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ అమాయక గిరిజనులను నమ్మించి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని వారి దగ్గర ఉన్న సర్టిఫికెట్లను తీసుకున్నాడని తెలిపారు. అంజలిబాయ్ ఫోన్ నెంబర్ తీసుకొని ఆమెతో అసభ్యకరంగా మాట్లాడుతూ మానసికంగా అనేక ఇబ్బందులకు గురి చేశాడన్నారు. బుధవారం తన సర్టిఫికెట్లు తీసుకెళ్ళమని అంజలి బాయ్, మల్లికార్జున్ నాయక్‌లకు రామ సుబ్బయ్య ఫోన్ చేసి పిలిపించి, ఆత్మకూర్ పట్టణంలోని నంద్యాల రోడ్డు సమీపంలో పొలంలోకి తీసుకెళ్లి మిత్రులతో కలిసి వారిపై కారంపొడి చల్లి కత్తులతో బెదిరించి హత్యాప్రయత్నం చేశాడన్నారు. బాధితులు వారి బారి నుండి తప్పించుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. రామ సుబ్బయ్యను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ బాల నాయక్, జిల్లా అధ్యక్షుడు విజయ నాయక్, ఆత్మకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విక్రమ్ సింహ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు రాం బాలాజీ నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, ఎఐబిఎస్ఎస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మహా సముద్ర దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

పట్టనంలోని రామకృష్ణ డిగ్రీ, పిజి కళాశాలలో గురువారం ప్రపంచ మహా సముద్ర దినోత్సవం ప్రొఫెసర్ జి. రామకృష్ణ రెడ్డి, కళాశాల డైరెక్టర్ జి. హేమంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకష్ణ రెడ్డి, సీనియర్ అనస్థీషియా రవికృష్ణ హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్, వృధా పదార్థాలు సముద్రంలో ఎక్కువగా వేయటం వలన అవి కలుషితం అవుతున్నాయని అన్నారు. ఫలితంగా అందులో జీవరాశులన్ని మరణిస్తాయని, ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో జీవరాశులు కనుమరుగవుతాయని తెలిపారు. సముద్ర జలాలు కాలుష్యరహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వ్యాసరచన, డ్రాయింగ్, ఎలక్యూషన్ వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. **బనగానపల్లె :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని వృక్షశాస్త్ర శాఖ అధ్యక్షురాలు డాక్టర్ వసుంధర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సముద్రాలు మనిషి మనుగడకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు కుమారి కుసుమేశ్వరి, కుమారి సౌమ్య ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కోటేశ్వరరావు, కౌసల్య దేవి, వహీదా, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరసం నంద్యాల జిల్లా నూతన కమిటీ సభ్యులు

అరసం జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - నంద్యాల

పట్టణంలోని నూనెపల్లె భగత్ సింగ్ జన చైతన్య గ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా కమిటీని గురువారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ముర్తుజా యస్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ నీలకంఠమాచారి, టి. విజయ దుర్గ, ప్రధాన కార్యదర్శి సి.సిహెచ్. మద్దిలేటి, సహాయ కార్యదర్శులుగా యస్ మహబూబ్ బాషా, ఎం మహమ్మద్ రఫీ, ఏ. ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా డా.వి. కళా మురళి, కమిటీ కార్యవర్గ సభ్యులుగా సి బాలరాజు, కన్నయ్య హిందీ పండిట్, జ్యోతిలక్ష్మి ఆత్మకూర్, మురళీధర్, ఓబులేసు, పివి.రామకృష్ణారెడ్డి, సయ్యద్, రవికుమార్, వై.కృష్ణుడు, ఆర్.నాగ శేషులు, మల్లేశ్వర్ ఎన్నిక అయ్యారు. జిల్లా అధ్యక్షులు ముర్తుజా మాట్లాడుతూ అభ్యుదయ రచయితలంతా సమాజం పట్ల బాధ్యత కలిగి మెలగాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో లోటుపాట్లను ఎత్తిచూపుతూ సమాజ హితానికి ఉపకరించే రచనలను విరివిగా చేయాలని కోరారు.

సిజెఎసి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

క్రైస్తవ సేవకులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు నంద్యాల జిల్లా సిజెఎసి కమిటీ ప్రెసిడెంట్ పాస్టర్ మాథ్యూ శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక పెంథెకొస్తు చర్చిలో సిజెఎసి మండలాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కమిటీలను ఎన్నుకోవడానికి ముఖ్య అతిథులుగా సిజెఎసి ఫౌండర్ జాషువా డానియల్ చేగుడి, షేక్ మక్బూల్, ఆర్‌సిఎం ఫాదర్ లూర్దు హాజరై కమిటీని ఎన్నుకున్నారు. సిజెఎసి కోయిలకుంట్ల మండల ప్రెసిడెంట్‌గా పాస్టర్ భూషణం, బనగానపల్లి మండల ప్రెసిడెంట్‌గా లూర్దు పాస్టర్ ఏలీయా, బేతంచెర్ల మండలం ప్రెసిడెంట్‌గా పాస్టర్ చంద్ర శేఖర్, పాణ్యం మండల ప్రెసిడెంట్‌గా పాస్టర్ ఏసుపాదం ఎన్నికయ్యారు.

నూతన కమిటీ సభ్యులు

నీటి కోసం ఎదురుచూస్తున్న స్థానికులు

తాగునీటి సమస్య పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పగిడ్యాల

నెహ్రూ నగర్ గ్రామంలో ఏర్పడిన తాగు నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం నాయకులు ఈశ్వరమ్మ, లక్ష్మన్న డిమాండ్ చేశారు. గురువారం నెహ్రూ నగర్ గ్రామంలో కుళాయిల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నెహ్రూ నగర్ గ్రామంలోని ఎల్లమ్మ బావి కాలనీలో గత నెల రోజుల నుంచి తాగునీరు సక్రమంగా రావడం లేదని వారు ఆరోపించారు. స్థానిక అధికారులకు సర్పంచుకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని విమర్శించారు. నీళ్ల వదిలి వాటర్ మ్యాన్ దృష్టికి తీసుకొస్తే సత్రం వద్ద వాలు ఉందని ఫోర్స్ పెంచితే నీళ్ల వచ్చే అవకాశం వాటర్ మాన్ చెప్పారని వారు చెప్పారు. అసలు వేసవి కాలం మూడు టెండలో మహిళలు సుదూర ప్రాంతాలకు వెళ్లి నీళ్ల తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో అన్ని కాలనీలకు నీళ్ల సక్రమంగా సరఫరా చేస్తూ ఎల్లమ్మ బావి కాలనీకి మాత్రం ఎందుకు సక్రమంగా సరఫరా చేయడం లేదని వారు ప్రశ్నించారు. తక్షణమే అధికారులు పాలకులు స్పందించి ఎల్లమ్మ బావి కాలనీకి నీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని లేనియెడల సిపిఎం ఆధ్వర్యంలో కాలనీవాసులతో సచివాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఏడి

కల్తీ అమ్మితే కఠిన చర్యలు : ఏడి

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని విత్తన దుకాణా దారులు కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని ఆత్మకూరు ఏడి ఆంజనేయ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న పుష్కర అగ్రో ఏజెన్సీస్ మరియు రాజరాజేశ్వరి విత్తన దుకాణాలను వ్యవసాయ అధికారి మహేష్ తో సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రైతులకు కల్తీ విత్తనాలు అమ్మకుండా నాణ్యమైన విత్తనాలు విక్రయించాల న్నారు. అలాగే అనుమతి పొందిన, నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని దుకాణదారులకు సూచించారు. నిర్ణయించిన ధరల కన్నా అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కొత్తపల్లి రైతు భరోసా కేంద్రం సందర్శించి, రికార్డులను పరిశీలిం చారు. ఖరీఫ్ సీజన్లో వేయబోయే పంటలను గురించి రైతులతో చర్చించారు. రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు చరణ్, సుశీల పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

టిడిపితోనే అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూరు

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా గురువారం నాడు ఆత్మకూరు మున్సిపాలిటీ తోటగిరి వీధిలో ఇంటింటి ప్రచారం నిర్వ హించారు. ఒక్క అవకాశం పేరుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నమ్మి ఓటు వేసిన ప్రజలను నట్టేట ముంచారని మండి పడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహానాడు వేదికగా ప్రకటించిన మిని మేనిఫెస్టో అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అబ్దుల్లాపురం బాష, జట్టి వేణుగోపాల్, నాగ కృష్ణయ్య, రామ్మూర్తి, కలిముల్లా తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న కెవిపిఎస్ నాయకులు

బేగరులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు

తరతరాలుగా స్మశానాల్లో గుంతలు తీస్తూ జీవిస్తున్న బేగరీలను ప్రభుత్వం గుర్తించి 45 సంవత్సరాలు దాటిన వారికి రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కే రంగమ్మ డిమాండ్ చేశారు. గురువారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలో సచివాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బేగరీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి వారికి ఐడి కార్డు ఇచ్చి, పెన్షన్ ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాదు, చిట్టిబాబు, చిన్నన్న,తిరుపాలు, కురుమయ్య రమణ, క్రిస్టఫర్,తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చెయ్యాలి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - ఆత్మకూర్

కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేసి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసు రత్నం, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్‌లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులరైజేషన్‌కు కట్‌ఆఫ్ డేట్‌ను 2014 జూన్ 2కు బదులుగా 2022 డిశంబర్ 31 నాటికి పరిగణించడం వలన, ఎక్కువ మంది రెగ్యులరైజ్ అవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఇద్దరినీ రెగ్యులరైజ్ చేస్తామని సిఎం జగన్ ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఇచ్చి .. నేడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని మ్యానిఫెస్టోలో పొందుపరిచి ఇప్పుడు దానికి భిన్నంగా జిఓ 7 విడుదలచేశారన్నారు. 25-11-1993కు ముందు నుండి పనిచేస్తున్న టైంస్కేల్, డైలీవేజ్, కంటింజెంట్ తదితర క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలన్నారు. కనీస వేతనం రూ.20 వేలు అమలు చేసి, వారి కుటుంబ సభ్యులకు సంక్షేమపథకాలు కొనసాగిం చాలన్నారు. కాంట్రాక్ట్, పార్ట్ టైం వ్యవస్థను ఫుల్‌టైమ్‌గా మార్చాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి యేసు రత్నం

యజమాని సంతకం లేకుండా సిసిఆర్‌సి కార్డు ఇవ్వాలి : వ్యకాసం

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో ఉన్న కౌలు రైతులకు మేలు జరిగేలా చట్టాన్ని సవరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్ సంజీవ రాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం వారు మాట్లాడుతూ భూ యజమాని సంతకం లేకుండానే గ్రామసభల ద్వారా సిసిఆర్సి కార్డులు ఇచ్చే విధంగా చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద 25 వేల రూపాయలు ఇవ్వాలని దేవాదాయభూముల కౌలుదారులకు సిసిఆర్సి కార్డులు ఇవ్వాలన్నారు. పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వాలని కనీసం మద్దతు ధరపై రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించి పంటలను కొనుగోలు చేయాలని కేరళ రాష్ట్ర ప్రభుత్వం తరహాలో రుణ విముక్తి కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. 60 ఏళ్ళు నిండిన కౌలు రైతులకు 6 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని కౌలు రైతులను ఈ క్రాప్‌లో నమోదు చేసి రాయితీలు అన్నింటిని కౌలు రైతులకు అందించాలని తెలిపారు. కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన కౌలు రైతు రక్షణ యాత్ర రాష్ట్ర నలుమూలల నుండి ఈనెల 12వ తేదీన విజయవాడ చేరుకుంటుందని విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం ముందు జరిగే ధర్నాలు కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కౌలు రైతు రక్షణ యాత్ర గోడ పత్రికలను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఏసన్న, కౌలు రైతు సంఘం నాయకులు గోదా వెంకటరమణ, బాలరాజు, లక్ష్మీనారాయణ, బక్కన్న, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ అధికారులకు బదిలీలు సహజం : జడ్పిటిసి

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రతి ప్రభుత్వ అధికారులకు బదిలీలు సహజమేనని జడ్పిటిసి పుల్యాల దివ్య, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అన్నారు. ఇఒఆర్‌డి నుంచి ఎంపీడీవోగా పదోన్నతిపై బదిలీ అవుతున్న పుల్లయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగస్తులు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎన్నోసార్లు బదిలీ అవుతారని బదిలీలు పదోన్నతులు సహజమేనన్నారు. ఇఒఆర్‌డిగా పగిడ్యాలకు వచ్చి 11 నెలలకే ఎంపీడీవోగా పదోన్నతిపై అనంతపురం రూరల్ మండలానికి బదిలీ కావడం ఎంతో అభినందనీయమన్నారు. పలురువక్తలు మాట్లాడుతూ అతికొద్ది నెలల్లోనే మండలంలోని ప్రజల, ప్రజాప్రతినిధులతో పుల్లయ్య స్నేహపూర్వకంగా ఉండేవారన్నారు. అనంతరం పూలమాలలు వేసి శాలువాలతో ఆయనను ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, తహశీల్దార్ భారతి, ఎంఈఓ సుభాన్, పిఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఎస్సై నాగార్జున, ఏపీవో మద్దిలేటి, ఈసీ అశోక్, పంచాయతీ కార్యదర్శులు సమతా యశోదర, వీరన్న యాదవ్, ఉపేంద్ర రెడ్డి, ఉపాధ్యక్షురాలు పల్లె అరుణమ్మ, సర్పంచులు పెరుమాళ్ళ శేషన్న, కూరాకుల రాజేశ్వరి, ఆంజనేయులు, ప్రభాకర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అస్లాం బాష, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతిపై బదిలీ అయిన పుల్లయ్యను సన్మానిస్తున్న అధికారులు ప్రజాప్రతినిధులు

మాట్లాడుతున్న వైసిపి ముస్లిం మైనార్టీ సెల్ జోనల్ ఇంచార్జ్ అబుబక్కర్

బాబు బిజెపితో జత కడితే చిత్తుచిత్తు

వైసిపి ముస్లిం మైనార్టీ సెల్ జోనల్ ఇంచార్జ్ అబుబక్కర్

ప్రజాశక్తి - నందికొట్కూరు

సిగ్గులేని చంద్రబాబు మళ్ళీ బిజెపితో జతకట్టాలని చూస్తున్నాడని రాబోయే 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని, నారా చంద్రబాబు నాయుడుని ముస్లిం మైనార్టీ ఓటర్లు చిత్తుచిత్తుగా ఓడిస్తారని నంద్యాల -కర్నూలు ఉమ్మడి జిల్లాల వైసిపి ముస్లిం మైనార్టీ సెల్ జోనల్ ఇంచార్జ్ అబుబక్కర్ అన్నారు. గురువారం స్థానిక ముబారక్ షాదీ ఖానా నందు పట్టణ ముస్లిం మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'హర్ దిల్ మే వైయస్సార్ హమ్ సబ్ జగన్ కే సాత్'లో అబుబక్కర్, నంద్యాల ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కే. యూనుస్ బాషాలు ముఖ్య అతిథు లుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం కేవలం రెండు వేల కోట్లు మాత్రమే కేటాయించగా, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో రూ.22,000 కోట్లను నాలుగు సంవత్సరాల వ్యవధిలోనే కేటాయించడం ప్రతి ముస్లింకి గర్వకారణమని తెలిపారు. అనంతరం ముతవల్లిలను ఉద్దేశించి మాట్లాడుతూ మసీదులకు సంబంధించిన ప్రహరీ గోడ, మస్జిద్ మరమ్మతుల కొరకు రాబోయే రోజుల్లో మసీదులకు సంబంధించిన అభివృద్ధి కొరకు వైసిపి మైనార్టీ సెల్ నాయకులు సందర్శించి నివేదికలను ప్రభుత్వానికి పంపించి మసీదు అభివృద్ధి కొరకు నిధులు కేటాయించేందుకు కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ అబ్దుల్ హమీద్, వార్డ్ ఇంచార్జ్ ఉస్మాన్ బేగ్, వైఎస్ఆర్సిపి మైనార్టీ సెల్ జిల్లా నాయకుల అబ్దుల్ రహిమాన్, తదితరులు పాల్గొన్నారు.

ఢీ -15 విజేత మధు కృష్ణకు సన్మానం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని చెందిన మధు కృష్ణ ఈటీవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఢీ 15వ సీజన్ విజేత మధు కృష్ణ వైసీపీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి సన్మానించారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో ఈటీవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఢీ15వ సీజన్ విజేత మధు కృష్ణకు కాటసాని ఓబుల్ రెడ్డి శాలువా కప్పి కేక్ కట్ చేసి సన్మానించారు. ఈ సందర్భంగా కాటసాని ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని హీరో షో రూం ఎదురుగా ఉన్నా ఓన్ వే డాన్స్ స్టూడియోలో గత నాలుగు సంవత్సరాల నుంచి అనిల్ మాస్టర్ ఆధ్వర్యంలో మధు కృష్ణ శిక్షణ పొందడం జరిగిందని తెలిపారు. మాస్టర్ సోమేశ్ ఆధ్వర్యంలో ఢీ 15 పోటీల్లో పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఢీ 15 పోటీలో విజేతగా నిలిచి బనగానపల్లె నియోజకవర్గానికి పేరు తీసుకువచ్చిన మధు కృష్ణకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, తాను అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మైనార్టీ నాయకులు ఆత్తార్ జాహీద్ హుస్సేన్, నాయకులు అంబటి రవి రెడ్డి, పాపిరెడ్డి సుదర్శన్ రెడ్డి, మేకల గణేష్ కుమార్ రెడ్డి,చంద్ర మౌళి, కటికవానికుంట మోహన్ రెడ్డి, మధు, జంబులయ్య, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

మధు కృష్ణను సన్మానిస్తున్న కాటసాని ఓబుల్ రెడ్డి

గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని యాగంటి పల్లె, మీరాపురం, పాతపాడు గ్రామాలలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శాంతిరాం వైద్యశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. గురువారం మండలంలోని యాగంటి పల్లె, మీరాపురం, పాతపాడు గ్రామాలలోహ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జిల్లా వర్కింగ్ కమిటీ చైర్మన్ నీరు కట్టు లక్ష్మయ్య ఆధ్వర్యంలో శాంతిరాం వైద్యశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. రోజులకు బిపి, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాల్లో 300 మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాగంటి దేవస్థానం మాజీ చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త దొనపాటి యాగంటి రెడ్డి, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, వైసిపి నాయకులు బండి బ్రహ్మానంద రెడ్డి, మనోహర్ రెడ్డి, డోన్ కాంసెన్సీ చైర్మన్ పసువుల దస్తగిరి, డోన్ ఎస్సీ సెల్ చైర్మన్ వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

డ్రైన్, శానిటేషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

డ్రైన్, శానిటేషన్ పనులను కమిషనర్ సి. రవి చంద్రారెడ్డి పరిశీలించారు. గురువారం ఉదయం మున్సిపల్ కమిషనర్, పద్మావతీ నగర్ నందు నూతనంగా నిర్మిస్తున్న డ్రైన్ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. శ్రీనివాస సెంటర్ నందు స్పెషల్ శానిటేషన్ టీంతో డ్రైన్ సిల్ట్, శానిటేషన్ పనులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా హిమబిందు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా హిమబిందు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న కళావతి ధర్మవరంకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కర్నూల్‌లో పనిచేస్తున్న హిమబిందు నంద్యాల ఏఈగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డిని ఆమె కలిశారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన హిమబిందు

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పాములపాడు

హౌసింగ్ నిర్మాణాలను ఈనెల చివరి నాటికి పూర్తి చేయాలని తహశీల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో గోపికృష్ణ కోరారు. గురువారం నాడు పాములపాడు జగనన్న హౌసింగ్ నిర్మాణాలను అధికారులు పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు త్వర గా నిర్మా ణాలు పూర్తిచేయాలని కోరారు. హౌసింగ్ ఏఈ శివరామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

సమస్యలు నెరవేర్చాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైల మండలంలోని సుండి పెంట, శ్రీశైలంలో పడక వేసిన పలు సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి దేవస్థానం మల్లికార్జున కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఎఫ్టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సుండి పెంట గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ ఆస్పటల్ నందు వైద్య సేవలు మెరుగుపరచాలని,గర్భిణులు వైద్యశాలలో ప్రసవం తర్వాత ఇంటికి వాహన సదుపాయాలని సమకూర్చాలని, ఎక్రే ప్లాంటును మరమ్మతులు చేయించా లని ఎమ్మెల్యే దృష్టికి ఆశీర్వాదం తీసుకొచ్చారు. అలాగే సుండి పెంట, శ్రీశైలంలో ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు మరుగుదొడ్ల ఏర్పాటు చేయా లని, సుండిపెంటలో వైయస్సార్ గృహాల నిర్మాణం చేపట్టి మౌలిక సదుపాయాలను కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. సున్నిపెంటలోని మెకానిక్‌లకు ఆటోనగర్ ఏర్పాటు చేయాలని,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిబాపూలే పూలే పేరు మీద కొంత స్థలానికి కేటాయించి కమిటీ భవనాన్ని ఏర్పాటు చేసే విధంగా సహకరి సహకరించాలన్నారు. మండలంలో అంగన్వాడి స్కూలుకు సొంతభవనాలు లేవని, ఇరిగేషన్ గృహాల్లో ఉన్నవారికి ఎవరి గృహాలు వారికి కేటాయించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ దేవస్థానంలో తోటమాలి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం చట్టం ప్రకారము రూ.12000 అమలు అయ్యేలా అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని అన్నారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

11న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - పాములపాడు

2023-24 విద్యా సంవత్సరానికి గాను పాములపాడు ఏపీ మోడల్ స్కూల్ నందు ఆరవ తరగతిలో ప్రవేశమునకు అర్హత పరీక్షను ఈనెల 11వ తేదీన(ఆదివారం) నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ నాగ రవీంద్రుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష ఉదయం పదిగంటల నుండి 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుం దన్నారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు సకాలంలో హాజరు కావాలన్నారు. హాల్ టికెట్ తెచ్చుకొని పరీక్ష సమయానికంటే ముందరనే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

స్వామివారి దర్శనానంతరం బయటకు వస్తున్న ఎమ్మెల్యే శిల్పా

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే శిల్పా

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వాళ్లను శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యుడు శిల్పా చక్రపాణి రెడ్డి గురువారం నాడు దర్శించుకున్నారు. దర్శనార్థమై ఎమ్మెల్యే తమ అనుచరులతో ఆలయ రాజ గోపురం వద్దకు చేరుకోగా ఆలయ అధికారులు ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు వేద పండితులు సంప్రదాయపద్యంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం శ్రీశైలంలోని మల్లికార్జున కళ్యాణ మండపంలో శ్రీశైలం మండలం గ్రామ వాలంటీర్లకు సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

10న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే సంజామలకు రాక

ప్రజాశక్తి - సంజామల

ఈనెల 10వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయాన్ని పసుల ఆసుపత్రిని ప్రారంభించడానికి వస్తున్నట్లు కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ గుండం సూర్యప్రకాశ్ రెడ్డి గురువారం తెలిపారు. మండల ప్రజలు, వైసీపీ కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఆత్మకూర్

శ్రీశైలం నియోజవర్గ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి సహ కారంతో శుక్రవారం జరగనున్న మెగా జాబ్ మేళాలు నిరుద్యోగ యువత యువకులు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం నాడు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలో పేరు ఉన్న కంపెనీలు ఈ జాబ్ మేళా కార్యక్రమం కి హాజరవుతున్నారని నియోజవర్గంలోని నిరుద్యోగ యువత ఈ మేళాకు హాజరై ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ నల్లకాల తిరుపాలమ్మ, వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, మండల పార్టీ అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి, పువ్వాడి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శిల్పా భువనేశ్వర్ రెడ్డి

టిడిపి నేత కుటుంబానికి బీసీ పరామార్శ

ప్రజాశక్తి - బనగానపల్లె

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గోదుల పక్కిరా రెడ్డి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గోధుల పకీర రెడ్డి మూడు రోజుల క్రితం బైక్ పై వెళ్తుండగా కిందపడి బలమైన గాయము తగలడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించాడు. ఈ విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లిబీసీ జనార్దన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గోధుల పక్కిరా రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, టిడిపి నేతలు, తదితరులు

పట్టుబడిన లారీ

240 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలో 40వ జాతీయ రహదారిపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ సీఐ నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న దాదాపు 240 బస్తాల రేషన్ బియ్యంతో ఉన్న లారీని గురువారం సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా వెలుగోడు నుంచి కడప జిల్లా మైదుకూరుకు ఏపీ 21 డబ్ల్యూ 2467 నంబరు గల లారీలో దాదాపు 240 బస్తాలను తరలిస్తుండగా సమాచారం అందుకున్న విజిలెన్స్ సీఐ నాగారాజు యాదవ్, ఎస్సై హనుమంతయ్యలు మండలం లోని మద్దూరు మెట్ట సమీపంలో దాడులు నిర్వహించి, లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవరు భాస్కర్‌ను అదుపులోకి తీసుకుని, లారీని స్థానిక పోలీసు స్టేషన్కు తరలించారు. అక్రమ రవాణాకు కారణమైన నింది తుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.